RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 53 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 29 ఆగష్టు 2024 | పేజీలు : 4 | వెల : 2/-



# రేవంత్ దూకుడు...

## బలమా.. బలహీనతా...!?

## తెరవెనుక ఏం జరుగుతోంది?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మాటలు కోటలు దాటుతున్నాయి. నేతలు నిగ్రహం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇంకా తాము ప్రతిపక్షంలోనే ఉన్నామన్నట్లు వ్యవహరిస్తుండగా, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు తాము ఇంకా అధికారంలో ఉన్నామన్న భావనలోనే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ఈధోరణి అధికార పార్టీ నేతల్లో మరింత అసహనం పెంచుతోంది. అధికారంలో లేకపోయినా అధికారంలో ఉన్న నేతలను ధూషించడాన్ని సహించలేకపోతున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను అటాక్ చేస్తున్నారు. విపక్షంలో ఉన్నపట్టిలాగే దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తన పదునైన మాటలతో చీల్చి చెండాడుతున్నారు. అధికారం చెప్పట్టినప్పటి నుంచి ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి వస్తామని బెదిరించడంతో ముందుగా బీఆర్ఎస్ పార్టీనే సగం ఖాళీ చేసేసి కేసీఆర్‌కు పెద్ద షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో కూడా బీఆర్ఎస్ పార్టీని దెబ్బ కొడితేనే కేసీఆర్‌ని కట్టడి చేయగలమని గ్రహించి దెబ్బ తీసి, ఫామ్‌హౌస్‌లో నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారు.

**అనేక ఎదురుదెబ్బలు తిని..** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో రాజకీయంగా ఎదిగారు. అంతకుముందు రాజకీయాల్లో ఉన్నా... తెలంగాణ ఉద్యమమే కేసీఆర్‌కు గుర్తింపు తెచ్చింది. ముఖ్యమంత్రిని చేసింది. ఇక రేవంత్‌రెడ్డి కూడా రాజకీయాల్లో అంత సుఖమైన ప్రయాణం సాగించలేదు. అనేక డక్కీమొక్కీలు తిన్నారు. టీడీపీలో ఓటుకునోటు కేసు.. కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి స్థాయికి వచ్చారు.

శ్రీరాముడు వానర సైన్యంతో మహా శక్తిశాలి అయిన రావణుడిని వదించిన్నట్లే, తన మాట అసలు వినని వానర సైన్యం వంటి కాంగ్రెస్ నేతలను వెంటబెట్టుకొని రేవంత్ రెడ్డి, రాజకీయాల్లో అపర చాణక్యుడని పేరు గుర్తింపు ఉన్న కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించారు. పామ్‌హౌస్‌కు పరిమితం చేశారు.

**ఆ ఇద్దరూ కొరకరాని కొయ్యలా..** కేసీఆర్ అంతటివాడిని రేవంత్ రెడ్డి ఓడగొట్టారనే విషయం మరిచిన కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యలా తయారయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. సబ్జెక్ట్, లెక్కల ఆధారంగా రేవంత్‌రెడ్డిని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డికి కావలసింది కూడా అదే. లేకుంటే ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యల జాబితా కొండంత ఉంది. కేటీఆర్, హరీశ్‌రావుతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు పోరాటాలు చేస్తూ ప్రజల దృష్టిని సమస్యలపై నుంచి మళ్లిస్తున్నారు. ఇక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోయినా, రేవంత్ రెడ్డి దూకుడు, వ్యూహాలను, వైఫల్యాలను నిశితంగానే గమనిస్తున్నారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చేశాక కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి దూకుడుకి చెక్ పెడతారని తెలుస్తోంది. ఆ ప్రయత్నంలోనే కేసీఆర్ బీజేపీ పెద్దలతో తెర వెనుక రాయబారాలు నడుపుతున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపిస్తున్నారు. అంటే కేసీఆర్ వలన ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డి కూడా గ్రహించిన్నట్లు భావించవచ్చు. అందుకే కాంగ్రెస్ మంత్రులు కోరుకుంటున్న స్వేచ్ఛ, గౌరవం, ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ఎవరూ పక్క చూపులు చూడకుండా జాగ్రత్తపడుతున్నారు.

**బీజేపీ–బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేలా..** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేతులు కలిపినా ఎదుర్కొనేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ కలవకూడాదనే తరచూ కుమ్మక్కు ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ కలిస్తే అప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయం కూడా రేవంత్ రెడ్డి చాలా ముందే పసిగట్టారని చెప్పవచ్చు.

అందుకే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అభినందనలు తెలిపి విభజన సమస్యలపై చర్చలకు ఆహ్వానించారని అనుకోవచ్చు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఉండటం చంద్రబాబు నాయుడుకి ఎంత ముఖ్యమో, అదేవిదంగా ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడుగా ఉండటం రేవంత్‌రెడ్డికి కూడా అంతే అవసరం. అప్పుడే వారు తమ ఉమ్మడి శత్రువులు జగన్, కేసీఆర్‌ను కట్టడి చేయగలుగుతారు. అందుకే రేవంత్ రెడ్డి కాస్త దూకుడుగానే ముందుకు సాగుతున్నారు. ఈ దూకుడు, వ్యూహాలు, అప్రమత్తం మాత్రమే సరిపోదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు తీర్చడం కూడా చాలా అవసరం.




హైదరాబాద్: ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తుందని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైదరాబాద్ బంజరాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్న కవితకు పార్టీశ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

"న్యాయబద్ధమైన పోరాటం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది. నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి.. కచ్చితంగా ఒక రోజు న్యాయం గెలుస్తుంది. నిజం నిలకడమీద తెలుస్తుందని తెలంగాణ ప్రజలకు తెలియజేస్తున్నా. కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటకు వస్తా. ప్రజా క్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తాం. నిజం కోసం పోరాటం చేస్తూనే ఉంటా" అని కవిత అన్నారు.

**శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం**... ఎమ్మెల్సీ కవిత దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. కవిత వెంట కేటీఆర్, హరీశ్‌రావు, కుటుంబ సభ్యులు ఉన్నారు. దిల్లీ మద్యం విధానం కేసులో ఐదున్నర నెలలు తిహాడ్ జైలులో ఉన్న ఆమె మంగళవారం బెయిల్ మీద విడుదలైన విషయం తెలిసిందే. ఐదు నెలల తర్వాత హైదరాబాద్ చేరుకున్న కవితకు పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి.



## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇంజినీరింగ్ కళాశాలలకు నోటీసులు ఇచ్చారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలకు రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారని అందులో పేర్కొన్నారు.




# నిరుపేదలకు శుభవార్త...

# ఇందిరమ్మ ఇండ్ల డిజైన్ రెడీ!

హైదరాబాద్ : ఈ నెలాఖరులోపే ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌ను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లను అందజేస్తామని వెల్లడించారు. దీంతో అధికారులు ఇండ్లకు సంబంధించి డిజైన్ పై కసరత్తు స్పీడప్ చేశారు. వరుస సమావేశాలు నిర్వహించి.. ఇప్పటికే నాలుగైదు రకాల డిజైన్లు రెడీ చేసినట్టు తెలిసింది.

సదరు డిజైనర్లపై హౌజింగ్ శాఖ మంత్రి సమీక్షించి, ముఖ్యమంత్రికి నివేదించి.. అప్రూవల్ పొందిన తర్వాతే ఫైనల్ చేయనున్నట్లు తెలిసింది. ఈఅంశంపై త్వరలోనే హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి సమీక్షించనున్నట్లు సమాచారం.

**పాత డిజైన్లకు సమీపంలో..** ఇందిరమ్మ ఇండ్ల పాత డిజైన్లకు సమీపంలోనే కొత్త డిజైన్ ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంటి నిర్మాణంలో 'కాంగ్రెస్ రికగ్రైజేషన్' కనిపించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. డిజైన్లు రూపొందించే ముందు ఈ అంశాన్ని గమనంలోకి తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్టు సమాచారం.

అయితే పాత డిజైన్ నుంచి లోగో, కలర్లను స్వీకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కేంద్రం సహకారంతో ఇండ్లు నిర్మిస్తే తాము రూపొందించిన లోగోను ఇండ్లపై తప్పనిసరిగా ఉండాలని కేంద్రం షరతు విధించింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ కోసం ప్రభుత్వం లోగోను ప్రభుత్వం తయారు చేయిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉండే గోడలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లోగోలను ముద్రించాలా అన్న దానిపై అధికారులు చర్చిస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల స్కీమ్స్‌పై స్టడీ!..** వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలపై అధికారులు స్టడీ చేస్తున్నట్టు తెలిసింది. అక్కడికి నేరుగా వెళ్లకుండా ప్రాథమికంగా ఇక్కడి నుంచే అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ విషయమై అధికారులకు హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

పథకం అమలులో ఆయా రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవటం ద్వారా తెలంగాణలో పథకాన్ని పకడ్బందీగా అమలు అవకాశముంటుందని తెలిపారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో అధికారులు ఎప్పుడు పర్యటిస్తారన్న దానిపై క్లారిటీ లేదు.

**నిధుల సమీకరణ సవాలే...** ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ కింద ఒక్కో ఇంటికి దశలవారీగా రూ. 5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. అయితే, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో 80 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది.

అందులో నుంచి అనర్హులను తొలగించి, అర్హులతో జాబితా తయారుచేసిన తరువాత ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్టు సమాచారం. అందుకు కావాల్సిన నిధుల సమీకరణ కూడా ప్రభుత్వ ఒక సవాలే కానుంది. మరోవైపు, 4.5 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసేందుకు రూ. 22,500 కోట్లు అవసరం కానున్నాయి.

అయితే, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 7,740 కోట్లు మాత్రమే కేటాయించారు. రిలైజ్డ్ ఎస్టిమేషన్స్ లో పెంచుతారా లేదా అన్న దానిపై సందిగ్ధత నెలకొన్నది. ఇక హౌజింగ్ శాఖ హడ్కో నుంచి రూ. మూడు వేల కోట్లు సేకరించాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి రూ. 1.5 లక్షల చొప్పున నిధులు అందే అవకాశముంది.

అయినప్పటికీ మరో రూ. 5,000 కోట్ల వరకూ లోటు ఏర్పడనుంది. దీనిపై ఎలా ముందుకు వెళతుందన్నది తేలాల్సి ఉన్నది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## హైదరాబాద్ ఇకపై 'హైడ్రా'బాద్ అవుతుందేమో?

'అదేదో హైడ్రా అట కద.. హైదరాబాద్ లో చెరువులను మింగేసి ఇళ్లు కట్టిన పెద్దపెద్ద వాళ్ల భరతం పడుతోందట.. అలాంటి మన ఊరిలోనూ ఉంటే బాగు..' తెలంగాణలోని ఓ సాధారణ గ్రామంలో చాయ్ బండి దగ్గర కొందరి ముచ్చట... "సారూ.. మా ఊరిలో ఒకప్పు 8 ఎకరాల్లో చెరువు ఉండేది.. కబ్జా చేసి వెంచర్లు వేశారు. దానిని వెదికి పెట్టండి".. తుమ్మలచెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్ లో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామస్థుల ఫిర్యాదు. ఇదీ ప్రస్తుతం హైదరాబాద్ లోనే కాదు తెలంగాణ వ్యాప్తంగా నడుస్తున్న చర్చ.. కమిషనర్ ఏవీ రంగనాథ్ సారథ్యంలో.. ఆక్రమణలపై దూకుడుగా వెళ్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) బడాబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. గత ఆదివారం కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, కావేరీ సీడ్స్ యజమాని భాస్కర్ రావు, ప్రొ కబడ్డీ లీగ్ ఓనర్ శ్రీనివాస్ భార్య అనుపమ తదితరులు గండిపేట చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ లో ఎకరాలకు ఎకరాలు ఆక్రమించి కట్టిన ఫాంహౌస్ లను నేల మట్టం చేసింది. నిన్నటికి నిన్న సినీ నటుడు నాగార్జున కట్టిన ఎన్ కన్వెన్షన్ ను తెల్లారేసరికి కూల్చేసింది. మొత్తం మూడు నెలల్లో... రాజధానిలో చెరువులు, పార్కు స్థలాలు ఆక్రమించి 18 చోట్ల చేపట్టిన 166 నిర్మాణాలను పడగొట్టామని హైడ్రా ప్రభుత్వానికి నివేదించింది. చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం(ఎఫ్ టీఎల్), బఫర్ జోన్ లో నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా ఏర్పాటైనప్పటి నుంచి చేపట్టిన చర్యలపై సర్కారుకు నివేదిక సమర్పించింది.

**స్వచ్ఛందంగా ఫిర్యాదులు..** హైడ్రా రంగంలోకి దిగాక హైదరాబాద్ వ్యాప్తంగా చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతల నుంచి స్వచ్ఛందంగా ఫిర్యాదులు అందుతుండడం గమనార్హం. అంతేకాదు.. ప్రజాప్రతి నిధుల అక్రమ నిర్మాణాలకు సంబంధించి డ్రోన్ చిత్రాలను 'ఎక్స్'లో పోస్ట్ చేస్తున్నారు. వాటిని సైతం కూల్చాలని హైడ్రాను డిమాండ్ చేస్తున్నారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీల నాయకుల నివాసాలు ఉండడం చెప్పుకోదగ్గ అంశం.

**మా ఊరికీ కావాలి ఓ హైడ్రా..** నిజాయతీపరుడైన అధికారిగా పేరున్న కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో హైడ్రా చేపడుతున్న కూల్చివేతలను సహజ వనరుల రక్షణ పట్ల ఆపేక్ష ఉన్నవారిని ఆకట్టుకుంటోంది. దీంతోపాటు తమ కళ్లెదుటే ఆక్రమణలకు గురైన చెరువులు, నీటి కుంటలను చూసి సాధారణ ప్రజలూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే తమ గ్రామానికీ హైడ్రా రావాలంటూ ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు కొందరు హైదరాబాద్ త్వరలో 'హైడ్రా'బాద్ కానుదంటూ సందర్భోచితంగా స్పందించారు.

**కొసమెరుపు:** కొన్ని దశాబ్దాల కిందట డిగ్రీ చదివిన యువత ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చేవారు. ఎక్కడ ఉన్నావని ఎవరైనా అడిగితే హైడ్రాబాద్ అని చెప్పేవారు. వారు అప్పుడు వ్యవహారికంలో అలా అన్నప్పటికీ ఇప్పుడదే సార్థకమయ్యేలా ఉంది.

# పీఎం మాన్‌ధన్ యోజనకు ఆదరణ కరవు

కరీంనగర్ : జిల్లాలో ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. అన్నదాతలకు వృద్ధాప్యంలో ఆసరాగా.. సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2018లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో దాదాపు 60 వేల మంది రైతులు అర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. కానీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వెయ్యి మంది మాత్రమే ఇందులో చేరారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**వయసు బట్టి ప్రీమియం డబ్బులు**

పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం సైతం తన వంతుగా బీమా కంపెనీకి డబ్బులు కడుతుంది. 18 ఏళ్ల రైతు తన వాటాగా రూ.55 చెల్లిస్తే కేంద్రం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తోంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. ఇలా 40 ఏళ్ల వారికి రూ.200 ప్రీమియం ఉంటుంది. ఇలా ప్రతి నెలా లేదా మూణ్నాలుగు, ఆరు మాసాలకోసారి సైతం నెలవారీ కిస్తులు చెల్లించే వెసులుబాటు కల్పించారు. అనంతరం 60 ఏళ్లు పైబడిన రైతులందరికీ నెలకు రూ.3 వేల పింఛను అందజేయనున్నారు. లేదా ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే.. రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకే సారి అందజేస్తారు. పథకంలో చేరిన రైతు మరణిస్తే జీవిత భాగస్వామి కొనసాగించవచ్చు.

**నమోదు ప్రక్రియ**

ప్రధాన్‌మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన(పీఎంకేఎంవై)లో చేరడానికి రైతులు కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)కు వెళ్లాలి. ఆధార్, ఫొటో, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నంబరు తదితర వివరాలతో పీఎంకేఎంవై పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. సమాచారం అందిన తర్వాత నిర్వాహకులు ప్రత్యేక పింఛను ఖాతా తెరచి కార్డును అందజేస్తారు. ఈ దరఖాస్తు రుసుం రూ.30 కూడా ఆన్‌లైన్ సేవా కేంద్రం నిర్వాహకులకు కేంద్ర సర్కారే చెల్లిస్తుంది.

అర్హులు–అనర్హులు

18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాలలోపు వయసు వారందరూ అర్హులు.

పీఎం కిసాన్ డబ్బులు పడే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజినీర్లు, ఇతరత్రా వృత్తినిపుణులు ఈ పథకానికి అనర్హులు.

ఆదాయ పన్ను చెల్లించే వారు, నిర్దేశితం కన్నా ఎక్కువ రాబడి



పొందుతున్న వారు, ఇతరత్రా ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందుతున్న వారు అనర్హులు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే కొనసాగింపు

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు తన వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.
శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి, కరీంనగర్

# 47 ప్రాజెక్టులు.. రూ.934.35 కోట్లు



కరీంనగర్ : దేశవ్యాప్తంగా వంద నగరాలను అత్యాధునికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కరీంనగర్ స్మార్ట్‌సిటీ మిషన్ పనులు తుది దశలో నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ 30తో గడువు ముగియగా.. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు మరోసారి గడువు పెంచింది. ప్రారంభించిన పనులు, మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేసుకునే వీలు కలిగింది. రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, వీధి దీపాలు, కూడళ్లు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, స్మార్ట్ క్లాసులు, కమాండ్ కంట్రోల్, డిజిటల్ తెరలు, ఉచిత వైఫై తదితర పనులు అందుబాటులోకి వచ్చాయి. మిగతా ప్రాజెక్టులు కొనసాగుతుండగా.. ఎప్పటిలోగా ఇవి పూర్తవుతాయనే విషయాన్ని మాత్రం అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు.

**చేసిన పనులు 25.. చేయాల్సినవి 20**

కరీంనగర్ స్మార్ట్‌సిటీ పరిధిలో అయిదేళ్లలో నిర్దేశించిన పనులన్నీ పూర్తి కావాల్సి ఉంటుంది. మొత్తం 47 ప్రాజెక్టులను ఎంపిక చేసుకోగా రూ.934.35 కోట్లు కేటాయించారు. ఇందులో 25 ప్రాజెక్టులను రూ.647.66 కోట్లతో పూర్తి చేశారు. మిగతా 20 ప్రాజెక్టులను రూ.259.69 కోట్లతో చేపడుతున్నారు. రూ.27 కోట్లలో మిగతా రెండు ప్రాజెక్టుల్లో భాగంగా మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు టెండర్ పిలవాల్సి ఉంది. బాలసదనం భవన నిర్మాణానికి రీ టెండర్ నిర్వహించాల్సి ఉంది. పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

**తప్పని అవస్థలు** వరద కాలువ నిర్మాణ సమయంలో పనులు కొన్ని చోట్ల వదిలేశారు. శ్రీనగర్‌కాలనీ నుంచి గోదాంగడ్డ ఎస్‌బీహెచ్ ఫంక్షన్‌హాల్ వరకు వరదకాలువ నిర్మించాల్సి ఉండగా 400 మీటర్లు ఆపేశారు. పది మీటర్ల వెడల్పు, ఎనిమిది మీటర్ల లోతులో ఉండటంతో నిలిపి వేసిన చోట నుంచి వరదనీరు వెనక్కి మళ్లీ ఇళ్లలోకి వస్తోంది. కట్టరాంపూర్‌లో డ్యాంకు వెళ్లే దారిలో రెండేళ్ల క్రితం డ్రైనేజీ కోసం తవ్వి వదిలేశారు. బెడ్, సలాక అల్లీ వదిలేయడంతో నీరంతా ఒక ఇంటి దగ్గర నిలిచి ప్రమాదకరంగా తయారైంది.

గణేశ్‌నగర్ బైపాసు రోడ్డులో మాజీ ఎమ్మెల్సీ ఇంటికి ఎదురుగా వరద కాలువ ఆపేశారు. కొంతదూరం పనులు చేయకపోవడంతో పాత గోడ కూలుతోంది. కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ పనులు మొదటి దశలో ఉన్నాయి. కందకం తవ్వి వదిలేశారు. పలుచోట్ల కూడళ్ల నిర్మాణం పూర్తిగా నిలిపి వేశారు. టవర్ సర్కిల్‌లో ఆధునికీకరణ పనులు కొనసా..గుతున్నాయి. ఇంతకంటే అధ్వానమైన పనులు ఎక్కడా జరగలేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. లైటింగ్స్ కోసం తవ్వుతున్నారు.. పూడ్చుతున్నారు. నడకదారి కోసం వేసిన టైల్స్, రెయిలింగ్ ఊడిపోతున్నా కనీసం పట్టింపు లేదు. వీటి నిర్వహణ ఎవరు చూడాలనే విషయాన్ని గుర్తించడం లేదు. స్మార్ట్ వీధి దీపాలు బిగించిన వాటిని వేయకపోవడంతో పలు చోట్ల అంధకారం ఉంటుంది. ఉస్మాన్‌పుర, అహ్మద్‌పుర, అశోక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఆగిపోయాయి.

# రక్షణ మాటల్లో.. ప్రాణాలు గాలిలో



హైదరాబాద్ : పరిశ్రమల యాజమాన్యాలు, అధికారుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటోంది. అనుమతుల్లేని, ప్రమాణాలు పాటించని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో వలస కార్మికులు మరణిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే కొన్ని యాజమాన్యాలు అవి బయటకు పొక్కకుండా రాజీ కుదురుస్తున్నాయి.

ఉదంతాలు...2024 జూన్ 28న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని సౌత్‌గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన కంప్రెషర్ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 2022 జులైలో జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వశిష్ట లైఫ్‌సైన్సెస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ పేలింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో సురేశ్ మృతి చెందాడు. 2022 ఆగస్టులో జీడిమెట్ల పరిధిలోని ఫార్మా కంపెనీలో రసాయన ప్రక్రియ సక్రమంగా లేకపోవడంతో మంటలంటుకున్నాయి. ఏడుగురు గాయపడ్డారు. ఏడాది క్రితం జీడిమెట్లలోని పారిశ్రామికవాడలోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఉద్యోగి మృతి చెందాడు.

నిఘా కొరవడటంతో... డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తనిఖీలు చేయకపోవడం, పీసీబీ అధికారులు కేవలం సీఎఫ్ఈ, సీఎఫ్‌వో అనుమతుల వరకే పరిమితం కావడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

మొత్తం పెట్టుబడిలో 2 శాతం 'పబ్లిక్ లయబులిటీ ఇన్సూరెన్స్' చేయించాలి. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టరేట్‌కు సమర్పించాలి.

2కేఎల్, 3కేఎల్‌కు బదులుగా 500ఎంఎల్ సామర్థ్యం ఉన్న రియాక్టర్లను, తక్కువ ఖర్చులో వస్తాయని సెకండ్ హ్యాండ్, నాసిరకం రియాక్టర్లను వినియోగిస్తున్నారు. అవి పేలిపోతున్నాయి. అక్కడే ఉన్న కార్మికులకు తీవ్రగాయాలై మరణిస్తున్నారు.

రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమల్లో ఈహెచ్‌ఎస్ (ఎన్విరాన్‌మెంట్ హెల్త్ సేఫ్టీ) డివిజన్ ఏర్పాటు చేయాలి. మాస్కులు, గాగుల్స్, గ్లౌజులు, బూట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ సేఫ్టీ అనుమతులే తీసుకోరు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు వెళ్లి ప్లాన్ అప్రూవల్ తీసుకెళ్లి సేఫ్టీ అనుమతులు తీసుకోవాలి. నిబంధనల ప్రకారం పరిశ్రమల్లో 'హజార్డ్స్ వేస్ట్ ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్, హ్యాండ్లింగ్, స్టోరేజ్' స్టడీ తప్పనిసరిగా నిర్వహించాలి. రసాయనాల నిల్వలో భద్రతా ప్రమాణాలుపాటిస్తున్నారో లేదో పరిశీలించాలి.

# కాబోయే అమ్మకు ఆపద

సంగారెడ్డి : కాబోయే అమ్మల్లో కొందరు పేదరికం కారణంగా సరైన పోషకాహారం తీసుకోకపోవడం, ఆరోగ్య సమస్యలు తదితర కారణాలతో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటున్నారు. వీరి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రాణాలకే ముప్పు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న వారిని గుర్తించి వైద్య, ఆరోగ్య, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకుంటోంది.

**ఏం చేస్తున్నారంటే..**

గర్భిణులకు నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తిస్తున్నారు. వీరిలో అత్యంతం ప్రమాదకరంగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోనూ గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గర్భస్థ శిశువు స్థితిగతులను తెలుసుకునే పరీక్షలు సమయానికి చేయించుకోవాలని తెలియజేస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాల్షియం, ఐరన్ మాత్రలు



పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గర్భిణుల గృహ సందర్శనలు చేసి ఆరోగ్యం విషయంలో ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5

అంగన్‌వాడీ కేంద్రాలు: 1,504

నమోదైన గర్భిణులు(ఏప్రిల్ నుంచి ఆగస్టు 21వరకు): 12,158

వీరిలో హైరిస్క్ గర్భిణులు: 3,508

**ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం**

గర్భిణులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి వారి ఆరోగ్యం మెరుగయ్యేలా ప్రాధాన్యం ఇస్తున్నాం. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సమన్వయంతో గర్భిణులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాట్లు చేశాం.
డా.గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి.

**గృహ సందర్శనలతో అప్రమత్తం చేస్తున్నాం**

పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుంది. ఇదే విషయాన్ని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గృహ సందర్శన సమయంలో కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఒక పూట సంపూర్ణ భోజనంతో పాటు ఇంట్లోనూ పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరిస్తున్నారు.
లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి.

# ఎన్నికలొస్తున్నాయ్

సిద్దిపేట: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆసక్తి ఉన్నవారు యువతను ఆకట్టుకునేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు షురూ చేశారు. గత ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీల పాలకమండలి పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఓటరు జాబితా పూర్తయితే పోలింగ్ తేదీలను విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి ఇటీవల ఎంపీడీఓలు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తయింది. ప్రత్యేక బుక్‌లెట్స్ అందుబాటులోకి తెచ్చారు. సెప్టెంబరు 6న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ**

ఏ గ్రామంలో ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కేటాయిస్తారనే దానిపై ఇప్పటినుంచే అందరూ ఉత్కంఠగా చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? కొత్తగా నిర్ణయం తీసుకుంటారా.. అనేది తేలాల్సి ఉంది. స్థానాలను మహిళలకు కేటాయిస్తే పురుషులకు అవకాశం రానిచోట భార్య, ఇతర మహిళ కుటుంబ సభ్యులను ఎన్నికల బరిలోకి దించేందుకూ నాయకులు సిద్ధమవుతున్నారు. ఇటీవల కొత్తగా 15 పంచాయతీలను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేశారు. వాటికి ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనే విషయం అధికారులు నిర్ణయించాల్సి ఉంది.

**బల్దియాలో కలుపుతారా?**

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా తొగుట, కొండపాక మండలాల్లో ముంపునకు గురైన దాదాపు 8 గ్రామపంచాయతీలను ప్రస్తుతం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించారు. ఆ గ్రామాల పేరుతోనే పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. వాటిని అలాగే కొనసాగిస్తారా లేక బల్దియాలో విలీనం చేస్తారా? అనేది తేల్చలేదు. గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని కోరుతూ ముంపు గ్రామాల వారు ఆర్డీఓకు, ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీల ఎన్నికలు పార్టీల రహితమైనా వెనుక ఉండి నడిపించేదంతా వారే కనుక పల్లెల్లో పట్టు సాధించేందుకు తీవ్రస్థాయిలో పోటీ పడతారు. అందుకోసం అన్ని పార్టీల ప్రధాన నాయకులు రాజకీయ సందడికి తెరలేపుతారు.

సిద్ధం చేస్తున్నాం: దేవకీదేవి, డీపీఓ

పంచాయతీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నాం. ముంపు గ్రామాల విలీన ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.


| | |
|---|---|
| మండలాలు | 26 |
| గ్రామ పంచాయతీలు | 499 |
| కొత్త పంచాయతీలు కలిస్తే మొత్తం | 514 |
| పాతవి వార్డులు | 4,470 |
| కొత్త వార్డులు కలిస్తే మొత్తం | 4,566 |
| 2011 గణాంకాల ప్రకారం.. మొత్తం జనాభా | 10,12,066 |
| గ్రామీణ జనాభా | 7,95,690 |

# బకాయిలు చెల్లిస్తేనే గృహజ్యోతి వర్తింపు

ధర్మపురి : ఇలా సాంకేతిక కారణాలతో జీరోబిల్లు రాని వారు, విద్యుత్తు ఛార్జీలు బకాయిలు పడ్డవారు బిల్లులు చెల్లించాల్సి ఒదేనని ఆ శాఖాధికారులు చెప్తున్నారు. ఆ బిల్లులు కడితేనే ప్రస్తుతం గృహజ్యోతి పథకం వర్తించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. పలు కారణాలతో గృహజ్యోతి వర్తించకపోతే విద్యుత్తు బిల్లులను రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో జిల్లాలో వేలాది మంది బిల్లులు కట్టకుండా ఉన్నారు. అయితే విద్యుత్తు సిబ్బంది బిల్లులు చెల్లించాల్సి ఒదేనని చెప్పడంతో వినియోగదారులు వాపోతున్నారు. రూ.నాలుగు నుంచి రూ.అయిదు వేల వరకు బిల్లుల బకాయిలు ఉన్నాయి.

**సరి చేసుకునే అవకాశం**

తెల్లరేషన్ కార్డు ఉండి గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందలేని వినియోగదారులు.. వివరాలను సరి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మీటర్‌కు సంబంధించి యూఎస్‌సీ నెంబర్ తప్పుగా నమోదైనా, ప్రజాపాలన దరఖాస్తుకు సంబంధించి ఆన్‌లైన్‌లో నాట్ అప్లైడ్ అని ఉన్నా, అద్దె ఉన్నవారు వేరే ఇంటికి మారిన వారు సరి చేసుకోవచ్చు. రేషన్ లేదా ఆధార్, ఆధార్ లింకు ఫోన్ నెంబర్, విద్యుత్తు మీటర్‌కు సంబంధించిన వివరాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి సరి చేసుకోవచ్చు.నేరెల్లకు చెందిన పాదం మీనయ్య తెల్లరేషన్ కార్డు ఉ



ండటంతో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నాడు. సాంకేతిక కారణాల వల్ల జీరోబిల్లు రాని వారికి ప్రభుత్వం బిల్లు రద్దు చేస్తామని చెప్పింది. దీంతో మీనయ్య మిన్నకుండటంతో ఆరు నెలల బిల్లు రూ.1300 వచ్చింది. ప్రస్తుతం బకాయి బిల్లు చెల్లిస్తేనే గృహజ్యోతి వర్తిస్తుందని విద్యుత్తు సిబ్బంది చెప్పడంతో మీనయ్య అవాకయ్యాడు.

బిల్లులు చెల్లించాలి: మనోజ్, విద్యుత్తు అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి, జగిత్యాల రూరల్ గృహజ్యోతి వర్తించినప్పటి నుంచే జీరో బిల్లు ఉంటోంది. సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందని వారు వర్తించే వరకు వచ్చిన బిల్లు కట్టాల్సిందే. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు గృహజ్యోతిలో తప్పులు దొర్లినట్లయితే ప్రభుత్వం సవరించుకునే అవకాశం కల్పించింది.

# డిజిటల్ మాయ

రంగారెడ్డి : సర్కారు భూములను పరిరక్షించేందుకు అక్రమార్కులు హద్దు మీరకుండా వాటిని కాపాడేందుకు భూములు.. స్థలాలకు గూగుల్ మ్యాపింగ్ చేస్తాం... డిజిటల్ సర్వేలు నిర్వహిస్తామంటూ రెవెన్యూ అధికారులు ఘనంగా ప్రకటించినా డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాప్‌లపై ఉదాసీనంగా ఉంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 42 వేల ఎకరాల ప్రభుత్వ భూములకు సరిహద్దుల్లేవు. హైదరాబాద్‌కు సమీపంలో 300కుపైగా గ్రామాలు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దులో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రైవేటు పట్టా, ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములున్నాయి. ప్రైవేటు పట్టాభూముల పక్కనే ఈ భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుని బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. ధరణిలో ప్రభుత్వ భూము



లుగా ఉన్నా వాటికి సరిహద్దులు నిర్మించాలంటే సర్వే నిర్వహించాలి. అక్రమార్కులు ప్రహరీలు, ఇనుపకంచెలు నిర్మించారు.

తూతూమంత్రంగా సర్వేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను డిజిటల్ సర్వే నిర్వహించాలంటూ కొద్దిరోజుల క్రితం నిర్ణయించారు. డిజిటల్ సర్వే నిర్వహించేందుకు అవసరమైన సర్వేయర్లు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని చాలా మండల కార్యాలయాల్లో అందుబాటులో లేరు. డిజిటల్ సర్వేకు హడావుడిగా కొనుగోలు చేసిన పరికరాలు ఆర్డీవో కార్యాలయాల్లో మూలనపడున్నాయి. ప్రభుత్వ భూముల సర్వేపై ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదు. కానీ ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో డిజిటల్ సర్వేలు చేయిస్తున్నారు.

# చిన్న షావల్స్ వైపే సింగరేణి మొగ్గు

కొత్తగూడెం : సింగరేణి ఉపరితల గనుల్లో ఓబీ(మట్టి) వెలికితీయడం, బొగ్గును ఉత్పత్తి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న షావల్స్‌పై యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టింది. సంస్థలోని 22 ఉపరితల గనుల్లో 11, 12క్యూబిక్ మీటర్ల భారీ షావల్స్ కంటే.. 5క్యూబిక్ మీటర్లున్న షావల్స్‌తోనే చురుగ్గా పనులు జరుగుతుండడంతో భవిష్యత్తులో వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆపరేషన్, ఈఅండ్‌ఎం విభాగం భావిస్తోంది. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన సమీక్ష సమావేశం లో షావల్స్ పనితీరుపై ఏరియా జీఎంలు, ప్రాజెక్టు అధికారులు, ఇంజినీర్ల అభిప్రాయాలను తీసుకున్న ఉన్నతాధికారులు.. వాటి పనితీరు పై సుదీర్ఘంగా చర్చించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పని..రూ.14కోట్ల వ్యయంతో కొనుగోలు చేస్తున్న షావల్స్‌కు సమానంగా రూ.6కోట్ల వ్యయాన్ని వెచ్చించిన చిన్న షావల్స్ పనిచేస్తున్నాయి. దీనికితోడు సంస్థలోని ప్రైవేటుగా ఓబీ వెలికితీసే గుత్తేదార్లు వినియోగిస్తున్న షావల్స్ అన్ని చిన్నవి కావడం కూడా ఓ కారణమే. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పని జరిగేలా చిన్న షావల్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారు. సంస్థలోని ఉపరితల గనుల్లో ప్రస్తుతం రెండు అతి భారీ యంత్రాలు దీనిలో ఓసీపీ-1 డ్రాగ్‌లైన్‌ను ఇప్పటికే యాజమాన్యం అమ్మకానికి పెట్టింది. అలాగే ఆర్జీ-2 డివిజన్ ఓసీపీ-3 ప్రాజెక్టులోని డ్రాగ్‌లైన్‌కు దాదాపు 6 నుంచి 8 నెలలకు సరిపడా పని స్థలాలు మాత్రమే ఉన్నాయి.

# రక్షిత తాగునీరు అందేనా?



గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు రానున్న తొమ్మిది నెలల్లో రక్షిత మంచినీరు సరఫరా కానుంది. ఇందు కోసం గోదావరి నీటిని శుద్ధి చేసే ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులతో ఆర్జీ-1, 2, 3 ప్రాంతంలోని 13 వేల కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. మరో తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గోదావరిఖనిలోని గంగానగర్ వద్ద నిర్మిస్తున్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ మే 2025 నాటికి పూర్తి కానుందని అధికారులు వెల్లడించారు.

ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీతో ఇబ్బందులే

ప్రస్తుతం సింగరేణి గోదావరిలో వేసిన ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ ద్వారా కార్మికుల కుటుంబాలకు తాగునీరు అందిస్తుంది. ఇసుక రేణువుల ద్వారా నీరు శుద్ధి అయి ఇన్‌ఫిల్ట్రేషన్ బావులోకి చేరుతాయి. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఇన్‌టేక్ వెల్‌లోకి చేరుకుంటాయి. మోటార్ల ద్వారా కార్మిక కుటుంబాలకు సరఫరా అవుతాయి. అయితే ఇన్‌ఫిల్ట్రేషన్ విధానం ద్వారా నదీ ప్రవాహ సమయంలో ఇబ్బంది లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిలో వెనక జలాల వల్ల ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీలు మునిగిపోయి బావుల్లోకి మురికినీరు చేరుతుంది. వర్షాకాలంలో అవి పూర్తిగా మునిగి పోవడంతో బావుల పైకప్పులు లేచి అందులోకి నది నీరు చేరుతుంది. దీంతో నీరు మురికిగా రావడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. వీటిని నాగ్‌పూర్‌కు చెందిన ఓ సంస్థతో యజమాన్యం మరమ్మతులు చేయించింది. నీటిలో పనిచేసే అనుభవం ఉన్న వారిని నదిలో దించి పనులు చేయించినా ఫలితం లేకుండా పోయింది.

**రోజుకు 35 మిలియన్ లీటర్ల నీరు శుద్ధి**

ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ విధానంతో కార్మిక కుటుంబాలకు సురక్షితమైన తాగునీరు అందకపోవడంతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానం అమలు చేయాలని సింగరేణి నిర్ణయించింది. మిషన్ భగీరథ తరహాలోనే తాగునీరు శుద్ధి చేయాలని ప్రణాళికలు వేసింది. దీని కోసం రూ.20 కోట్లు కేటాయించింది. గోదావరి నీటిని మోటార్ల ద్వారా గ్రావిటీ ఫిల్టర్ బెడ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేయనున్నారు. దీని వల్ల నీటిలో ఎలాంటి మలినాలు, మురుగు నీరు చేరే అవకాశం ఉండదు. రోజుకు 35 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో ఈ ఫిల్టర్ బెడ్‌లు నిర్మిస్తున్నారు. రామగుండం-1 ప్రాంతానికి 20 మిలియన్ లీటర్లు, ఆర్జీ-2, 3 డివిజన్‌లకు 15 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండం రీజియన్‌లో 13 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వారి కుటుంబాలు మరో 40 వేల మంది ఉంటారు. వీరికి రోజునకు 35 మిలియన్ లీటర్ల నీరు అవసరం పడుతుంది. దానికి అనుగుణంగానే సింగరేణి ఏర్పాట్లు చేస్తుంది.

**మే నాటికి పనులు పూర్తి** సురక్షితమైన తాగునీరు అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. 2025 మే నాటికి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తాం. దీనివల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్య రాదు. మురికినీరు వచ్చే అవకాశం ఉండదు. నిర్మాణం పనులు వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం

# ఆపద వేళ.. మేమున్నామని భరోసా



కరీంనగర్ : ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం రావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. ప్రయాణికులకు ఆపత్కాలంలో 'మేమున్నాం అంటూ' భరోసానిస్తున్నారు సంస్థ సిబ్బంది. ఒక వైపు విధి నిర్వహణ బాధ్యత చూస్తూనే.. మరో వైపు సేవా కార్యక్రమాల్లో తరిస్తున్నారు. గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతుంటే వైద్య సిబ్బంది అవతారమెత్తి అండగా నిలుస్తున్నారు. ఎవరైనా వస్తువు మరిచిపోతే మంచి మనసుతో వారి చెంతకు చేరుస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది ఔదార్యంపై కథనం.

**నిత్యం లక్ష మంది రాకపోకలు..**

కరీంనగర్ బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం లక్ష మందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ ఉద్యోగులు, పొరుగుసేవల సిబ్బంది విధులు నిర్వర్తిస్తూనే ఆపద వేళ ప్రయాణికులకు అండగా ఉంటున్నారు. ప్రయాణికులు అనారోగ్యంగా ఉన్నట్లు తెలిస్తే ఆసుపత్రికి పంపిస్తున్నారు. గర్భిణులు నొప్పులతో బాధపడటంలాంటి సందర్భాల్లో 108కు సమాచారం ఇస్తున్నారు. ప్రయాణికులు పోగొట్టుకుంటున్న విలువైన వస్తువులు తిరిగి అప్పగిస్తున్నారు.వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటే మేలు

రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద ప్రయాణ ప్రాంగణం ఇది. ఇక్కడ రోజూ వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత మహిళల సంఖ్య మరింత పెరిగింది. రోజూ ఎవరో ఒకరు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆలోచించి.. ఇక్కడ ఒక వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంటే ప్రయాణికులు మేలు చేసినవారవుతారు.

**కొన్ని ఘటనలు ఇలా..**

మే 6న ఓ వృద్ధురాలు బస్టాండ్‌కు వచ్చి.. అస్వస్థతకు గురికాగా స్పందించిన సిబ్బంది 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

జూన్ 16న ఒడిశాకు చెందిన గర్భిణి కుంట (ఛత్తీస్‌గఢ్) వెళ్లడానికి కరీంనగర్ బస్టాండ్‌కు రాగా, ఆమెకు నొప్పులు రావడంతో.. ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, స్రవంతి, లావణ్య, భవానీ, రేణుకలు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రసవం చేశారు. ఆమె పండటి పాపకు జన్మనిచ్చింది. అనంతరం 108 వాహనంలో తల్లి, శిశువును ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు సంస్థ ఎండీ సజ్జనార్, కలెక్టర్, ఇతర అధికారులు ప్రశంసించారు.జూన్ 20 మంచిర్యాల నుంచి హైదరాబాద్ వెళ్లే ఓ ప్రయాణికుడు రూ.3 లక్షల బ్యాగ్‌ను బస్సులో ఉంచి.. పెద్దపల్లిలో దిగగా.. అతడు వచ్చే లోపు బస్సు వెళ్లిపోయింది. ఆయన వెంటనే కరీంనగర్ బస్టాండ్ భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏటీఎం రజనీకృష్ణ, ఎస్‌ఎం అంజయ్య బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎం సుచరిత ఆధ్వర్యంలో ఆయనకు అందజేశారు.

ఆగస్టు 18న లక్ష్మి అనే గర్భిణి హుస్నాబాద్ నుంచి మందమర్రి వెళ్లడానికి కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చింది. ఆమెకు నొప్పులు రావడంతో ఎస్‌ఎం అంజయ్య 108కు సమాచారం అందించారు. ఆమె వెంట మంగ అనే పొరుగు సేవల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రసవమయ్యే వరకు (రాత్రి 11 గంటల) అక్కడే ఉంది.

**అధికారుల ప్రశంసలు..**

ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు అదనంగా సేవా కార్యక్రమాలు చేయడంపై ప్రయాణికులు అభినందిస్తున్నారు. మహిళకు బస్టాండ్‌లో ప్రసవం చేసిన సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 వేల నగదు పురస్కారం అందజేయగా, సంస్థ ఎండీ సజ్జనార్ హైదరాబాద్‌లో సత్కరించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టేషన్ మేనేజర్ అంజయ్య మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

# సొంత నైపుణ్యం.. వస్త్రాల్లో వైవిధ్యం



సిరిసిల్ల: ఒక ఆలోచన.. ఆ వృత్తిలో పని చేసేవారందరికీ ఉపయోగపడితే స్ఫూర్తిగా నిలుస్తుంది. బతుకమ్మ చీరల డిజైన్లపై పని చేసిన అనుభవంతో కాటన్ చీరలు నేస్తున్నారు. నెల రోజుల క్రితం సిరిసిల్లలో ఒకటి, రెండు మగ్గాలపై ప్రారంభమైన ఉత్పత్తులు, పలు రకాల డిజైన్లతో వంద మగ్గాలకు చేరుకున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నేతన్నలు తమ నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. సొంత ఉత్పత్తులతో మార్కెట్‌ను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని 30 వేల మరమగ్గాల్లో 14 వేల మగ్గాలకు డాబీ, జకార్డు పరికరాలు ఉన్నాయి. వీటికి కొద్దిపాటి మార్పులు చేసుకుంటే చాలు. పాలిస్టర్ నుంచి పట్టువస్త్రాల వరకు చాలా రకాలు ఉత్పత్తి చేయొచ్చు. సిరిసిల్లలో అలాంటి నైపుణ్యాలున్న నేతన్నలకు కొదువలేదు. ఏడాది క్రితం పాలిస్టర్ నూలుతో బతుకమ్మ చీరలు నేసిన మరమగ్గాలపై ప్రస్తుతం కాటన్ చీరలు నేస్తున్నారు. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. అందులోనూ వందశాతం కాటన్, సిల్కు నూలు, జరీ అంచులో డిజైన్లు ఉన్నవి మగువలను ఇట్టే ఆకర్షిస్తుంటాయి.

గద్వాల, పోచంపల్లి, ధర్మవరం వంటి ప్రాంతాలు కాటన్ చీరల ఉత్పత్తులకు ప్రసిద్ధి. సిరిసిల్ల, తంగళ్లపల్లిలోని నేతన్నలు హైదరాబాద్, కర్ణాటక, చెన్నై, చీరాల, చిలకలూరిపేటలోని వస్త్ర వ్యాపార సంస్థల నుంచి ప్రత్యేకంగా చీరల ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. సుమారు 50 నుంచి 100 మగ్గాలపై వివిధ రకాల డిజైన్లతో వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. డిజైన్ల కోసం డాబీ, జకార్డు అమర్చిన మరమగ్గాలకు కొద్దిపాటి మార్పులు చేసుకుంటున్నారు.

ఎప్పుడూ ఒకే రకమైన వస్త్రోత్పత్తులతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గి పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పత్తిలో వైవిధ్యాన్ని చూపాలి. జిల్లా పరిశ్రమలో తొలుత బతుకమ్మ చీరలకు జరీ అంచులు, డిజైన్లు వచ్చినపుడు ఆసాములు, కార్మికులు ఉత్పత్తిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇది పూర్తిగా కాటన్, సిల్కు నూలు కాబట్టి కార్మికుడు రెండు మగ్గాలపై మించి పని చేసే పరిస్థితి ఉండదు.

కార్మికుడు ఒక షిఫ్టులో మూడు చీరలు ఉత్పత్తి చేయగలడు. ఒక చీరకు రూ.250 చెల్లించేలా ధర నిర్ణయించారు. ఇలా రెండు మగ్గాలపై ఆరు చీరలు నేయగలడు. అంటే రోజుకు సుమారు రూ.1,500 వరకు కార్మికుడు కూలీ పొందవచ్చు. బతుకమ్మ చీరలకు గరిష్ఠంగా ఆరు మగ్గాలపై పని చేయాలి. దీనికి రూ.800 వరకు గిట్టుబాటు అవుతుండేది. కేస్‌మెంట్, పాలిస్టర్ వస్త్రోత్పత్తులకు రోజుకు సగటున రూ.300 నుంచి రూ.400 కూలీ లభించడం గగనమవుతుంది.

ఉపాధికి ఢోకా లేదు - బైరి శ్రీనివాస్, వ్యాపారి

బతుకమ్మ చీరలు నేసిన మగ్గాలకే కొద్దిపాటి మార్పులు చేసుకుంటే చాలు మంచి డిజైన్లతో చీరలు నేయవచ్చు. వీటికి అవసరమైన ముడి సరకు స్థానికంగా లభ్యమవుతుంది. ఇక మార్కెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటే డిమాండ్ ఉన్న వస్త్రాలు తెలుస్తాయి. నైపుణ్యం, నాణ్యతను బట్టి ఆర్డర్లు పెరుగుతాయి. దీంతో ఉపాధి అవకాశాలు వెతుకుంటూ సిరిసిల్లకు వస్తాయి.

# గంగ ఉన్నా.. పంటలకు గగనమే!

తాండూరు : శివసాగర్ జలాశయం నుంచి ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగు నీరు అందేలా కనిపించడం లేదు. నిధులు సిద్ధంగా ఉన్నా, రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడంలేదు. దీంతో నిర్ణీత ఆయకట్టుకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం గగనంగా మారింది. ఏటా వర్షాలకు ప్రాజెక్టు నిండడం అలుగు పారడమే జరుగుతోంది. రైతులు వర్షాధార పంటలను సాగు చేయక తప్పడం లేదు.

**19ఏళ్ల కిందట పనులు ప్రారంభమై**

కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు 19 ఏళ్ల కిందట ప్రారంభమైంది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నదికి అడ్డంగా కరకట్ట నిర్మించారు. శిఖం భూమిలో నీటిని నిల్వ చేసి భూములకు వదిలేందుకు ప్రధాన తూము నిర్మించారు. అధికమైన నీరు దిగువకు వెళ్లేందుకు అలుగు నిర్మాణం ప్రమాణాల మేరకు జరగలేదు. దీంతో తూము వైపు ఒత్తిడి పెరగడంతో 2013లో వెలుపలి భాగం కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయడంతో 2014 నుంచి నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం చేసిన గుత్తేదారును బ్లాక్ లిస్టులో చేర్చారు. అనంతరం నిధులు



మంజూరు చేసి మరో గుత్తేదారుకు పనులు అప్పగించినా ఫలితం లేదు. కట్టకు ఇరువైపులా వృక్షాలు పెరిగాయి. భూసేకరణ జరిగినా..: జలాశయం నుంచి ఆయకట్టు భూములకు నీటిని వదిలేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం భూములను సేకరించింది. రైతులకు పరిహారం చెల్లించారు. కాలువల నిర్మాణానికి ఇంజినీర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటే పనులు జరగాల్సి ఉన్నా, అడుగు ముందుకు పడలేదు. భూములు ఖాళీగా ఉండడంతో పరిహారం పొందిన రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం - సుందర్, ఎస్ఈ. జలాశయం పనులను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం. వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. అలుగు పనులు కొంత మేర జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కాగానే కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తాం.

# ఊరికి ఉపకారులు

తాండూరు : ఎంత ఎదిగినా జన్మభూమిని మరువరు కొందరు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకో.. తాము పుట్టిపెరి గిన ఊరి బాగోగుకో.. కృషి చేస్తుంటారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసాలకు ఊతం అందిస్తున్న వారు ఉన్నారు. అలా స్వస్థలాల సేవలో తరిస్తూ.. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు...

**స్థలం విరాళం.. చదువుకు ఆధారం**

తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు చెందిన సేవ్యానాయక్ గుంట స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విరాళంగా అందించారు. 1999లో చేసిన భూదానంతో తొలిసారిగా తండాలో సర్కారు బడి ఏర్పాటైంది. గిరిజన రైతు అందించిన సహకారం విద్యార్థుల చెంతకే బడి వచ్చేలా చేసింది. అప్పటివరకు తండాలో బడిలేక చిన్నారులు అయిదు కిలోమీటర్ల దూరంలోని జిన్‌గుర్తి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొందరు చదువులకు దూరమయ్యారు. సొంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి అప్పగించడంతో పాతిక సంవత్సరాలుగా పాఠాలు నేర్పించేందుకు వెసులుబాటు లభించింది.

**రూ. లక్ష వెచ్చించి.. గుడి నిర్మించి** స్పందించే మనసు ఉంటే గుడికైనా, బడికైనా



సహకారం అందిస్తారు. ఆ కోవలోకే చేరుతారు కరుణా కర్‌రెడ్డి. పూడూరు మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఆయన కుటుంబంతో 30 ఏళ్ల కిందట తాండూరుకు వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, పుణ్యమ్మ, భార్య సుజాత సహకారంతో కోట్‌పల్లి మండలం సుల్తాన్‌పూరులో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందు కోసం ముందుగా ఆయన రూ.లక్ష వరకు వెచ్చిం చారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సహకారంతో గతేడాది పనులు మొదలు పెట్టి ఈ ఏడాది పూర్తి చేశారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో రెండు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

**పదేళ్లుగా మాతృభూమి సేవలో..**

ఎన్నారై డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి స్వస్థలం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి. సొంతూరుతోపాటు పక్క గ్రామమైన బూచినెల్లికి సేవలందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు ల్యాప్‌టాప్‌లు, 25 కంప్యూటర్లు అందజేశారు. 18 మంది గ్రామస్థులకు కంటి శస్త్రచికిత్సలు చేయించ డంతోపాటు 370 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు పేద విద్యార్థుల పూర్తి ఫీజు చెల్లించే బాధ్యత తీసుకున్నారు. తొలి ఏడాది ఫీజు రూ.2.20 లక్షలు చెల్లించారు. ఓ బోరుబావి తవ్వించడంతోపాటు.. రెండేళ్ల కిందట గ్రామంలో రూ.18 లక్షలతో 22 సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు.

**నీటి వెత తీర్చి..**

దోమ మండలం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. బడిలో ఏర్పాటు చేసిన ట్యాంకు మరమ్మతుకు గురైంది. దీంతో తాగునీటికి చిన్నారులు, మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిసింది. వెంటనే సంస్థ ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బడికి దగ్గర్లోనే గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు నుంచి పాఠశాల వరకు పైపులైన్ వేయించి ట్యాంకుకు, వంట గది వద్ద కుళాయి ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.10వేలు వెచ్చించారు. ప్రస్తుతం నిరంతరం నీటి సరఫరా కావడంతో సమస్య తీరింది. ఇంకే సమస్య ఉన్నా, సహకారం అందించేందుకు ముందుంటామని శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




దిల్లీ: దేశ ప్రజల సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' పథకానికి నేటితో పదేళ్లు పూర్తయింది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సమ్మిళిత అభివృద్ధికి తోడ్పేందుకు రూపొందించిన ఎన్నో ఆర్థిక పథకాల్లో ఇదీ ఒకటి. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం విజయవంతం చేసిన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. ''సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంతో పాటు కోట్లాది మందికి.. ముఖ్యంగా మహిళలు, యువత, అణగారిన వర్గాలకు గౌరవాన్ని అందించడంలో ఈ పథకం అత్యంత ముఖ్యమైంది. ఇది దేశ ప్రజల గౌరవం, సాధికారత, దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ఎంతో ఉపయోగపడింది" అని ప్రత్యేక పోస్టులో ప్రధాని పేర్కొన్నారు. దేశంలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడటం జన్‌ధన్ పథకం ప్రధాన లక్ష్యం. "మీలో చాలా మంది ముఖ్యంగా యువత.. ఈ పథకం ఎందుకు అంత ముఖ్యమైందని ఆలోచిస్తారు..? ప్రస్తుత పరిస్థితుల్లో అన్నింటే ముఖ్యంగా ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండడం ఎంతో ముఖ్యం. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకు దాదాపు ఎన్నో సామాన్య కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు. దీని వల్ల సామాన్యుల సొత్తు చోరీ గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఆర్థిక భద్రత లేకపోవడంతో ప్రజల ఆశలు కలలుగా మిగిలేవి" అని అన్నారు. "జన్‌ధన్ యోజన ప్రారంభించినప్పుడు.. దాని చుట్టూ ఉండే సమస్యలు, సందేహాలు నాకు ఇంకా గుర్తున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం సాధ్యమవుతుందా..? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. కానీ, ఈ ప్రయత్నం మంచి మార్పుకు దారి తీస్తుందని నమ్మాను. 53 కోట్ల మందికి పైగా ప్రజలు బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారు. ఇది ఊహించని పరిణామం. ప్రస్తుతం ఈ ఖాతాల్లో డిపాజిట్ల బ్యాలెన్సు రూ. 2. 3 లక్షల కోట్లు. వీటిలో 65 శాతానికి పైగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల వారు ఉండడం విశేషం. అంతేకాకుండా ఈ పథకం ద్వారా మహిళా సాధికారతను సాధించాం. దాదాపు 30 కోట్ల మందికి పైగా మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురాగలిగాం" అని ప్రధాని పేర్కొన్నారు.

## యుద్ధాలతో పోలిస్తే.. రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు: గడ్కరీ




దిల్లీ: యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి" అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబులెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్‌లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు వేగంగా స్పందించడంతోపాటు.. కట్టర్ల వంటి అధునాతన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

## బోనస్ చెల్లిస్తామన్న మాటను బోగస్ చేశారు..

హైదరాబాద్: ఆహార పంటల బదులు పప్పుధాన్యాల సాగుతో మెరుగైన లాభాలు సాధించ వచ్చన్న రైతుల ఆశలు అడియాశలు చేసేలా మీ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటా పెసరకు మద్దతు ధర రూ. 8,682 ప్రకటించినప్పటికీ ఆ ధరకు ఎవరూ కొనుగోలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు పంటను క్వింటా రూ.6,000 నుంచి రూ.6,500 మధ్యనే రైతులు విక్రయిన్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారులు ఆడిందే ఆటగా మారటంతో రైతులు క్వింటాకు రూ.2,500 పైగా నష్టపోతున్నారన్నారు. ఈ సంవత్సరం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీష్ రావు తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం ప్రదర్శించడం పెసర పంట రైతులకు శాపంగా మారిందన్నారు. కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించే పరిస్థితి లేదని ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నారాయణ పేట, సూర్యపేట తదితర జిల్లాల రైతులు తీవ్ర ఆవేదన, ఆందోళన చెందుతున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే రుణమాఫీ, రైతు బంధును అటకెక్కించిన మీ ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తామన్న మాటను బోగస్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మంగళం పాడారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అదే తీరుగా ఇప్పుడు మద్దతు ధర ప్రకారం పంటలు కొనుగోలు చేసే బాధ్యతను విస్మరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలు పండించడం, పండించిన పంటలను విక్రయించుకోవడం రైతన్నకు కత్తిమీద సాముగా మారిందన్నారు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలు, జిల్లాల్లో తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా చూడాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు పేర్కొన్నారు.




హైదరాబాద్: ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సీడబ్ల్యూసీ సభ్యుడు పల్లంరాజు నిర్మాణాన్నే హైడ్రా మొదట కూల్చివేసింది. జన్వాడ ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారు.. సర్పంచ్‌లు కాదని పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు తెలియదా?నా కుటుంబం కబ్జా చేసినట్లు కేటీఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తా. విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం. హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకే మొదటి ప్రాధాన్యం. 30 ఏళ్ల కింద కట్టిన అక్రమ నివాస కట్టడాలైనా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. భారాస నేత హరీశ్‌రావు సిద్ధమైతే ఆయన నేతృత్వంలోనే చెరువుల ఆక్రమణలపై నిజ నిర్ధరణ కమిటీ వేస్తాం. హైడ్రా కూల్చివేతలపై ఒత్తిళ్లు వస్తున్నాయి.. అయినా ఎదుర్కొంటాం.. వెనక్కి తగ్గేది లేదు" అని సీఎం వ్యాఖ్యానించారు.



## పేరు ప్రస్థావించకుండా కేసీఆర్ పై రేవంత్ నిప్పులు!!

హైదరాబాద్ : సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లలో తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని అన్నారు. రాజకీయ విమర్శల జోలికి పోను కానీ... అంటూనే గత పాలకులపై ఫైరయ్యారు. అవును... సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి... 2014 నుంచి 2024 వరకూ సుమారు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నవాళ్లు ఎన్నెన్నో నిర్మించామని, ప్రపంచానికే ఆదర్శంగా నిలబడ్డామని గొప్పలు చెప్పుకుంటారు కానీ... తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెరమరుగు చేశారని విమర్శించారు. ఎందుకంటే... తెలంగాణ తల్లి కంటే వారే ప్రాధాన్యత, వారే తెలంగాణకు సర్వం, నేనే తెలంగాణ.. తెలంగాణే నేను అన్నట్లుగా గత పాలకులు వ్యవహరించారని తెలిపారు. అటువంటి పాతవిధానాలకు ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విరుద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతి భవన్ ప్రస్థావనను తీసుకొచ్చారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇందులో భాగంగా... గత పాలకులు ప్రగతి భవన్ పేరు చెప్పి పెద్ద గడీని ఏర్పాటు చేసుకుని, చుట్టూ ముళ్లకంచెలు పెట్టుకున్నారని.. వందల సంఖ్యలో పోలీసుల పహారా మధ్య వారు భద్రంగా అక్కడ ఉండి, తెలంగాణ ప్రజలకు ప్రవేశం లేదని నిషేధించారని తెలిపారు. అలాంటి ప్రగతి భవన్ ను ప్రజా భవన్ గా మార్చినట్లు తెలిపారు. అలాంటి ప్రగతి భవన్ అనే గడీని.. నేడు తెలంగాణ ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే ప్రదేశంగా మార్చినట్లు తెలిపారు! ఇక సచివాలయం అంటే తెలంగాణ పరిపాలనకు గుండె అని.. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ఇక్కడి నుంచే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని.. అయితే గత పాలకులు మాత్రం సచివాలయంలో అందుబాటులో ఉండేవారు కాదని ఫైరయ్యారు. ఇక, దసరాకు మంచి రోజులు లేవని.. అందుకే ఇవాళ భూమిపూజ చేసినట్లు చెప్పిన రేవంత్ రెడ్డి... రాష్ట్ర ప్రజలకు పండగ రోజైన డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు!


## ఒవైసీ, మల్లారెడ్డి కళాశాలలపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా కమిషనర్



హైదరాబాద్: రాజకీయ చదరంగంలో హైడ్రా పావుగా మారదలుచుకోలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. "ఒవైసీ, మల్లారెడ్డి అనేది చూడం. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తాం. చెరువులను ఆక్రమించి కళాశాల భవనాలు కట్టడం వాళ్ల పొరపాటు అయి ఉండొచ్చు. ఎఫ్‌టీఎల్ అనేది ముఖ్యమైన అంశమే, దానికంటే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం. ఒవైసీ, మల్లారెడ్డి లాంటి వ్యక్తుల కళాశాలలకు సమయం ఇస్తాం. పార్టీలకు అతీతంగా మా చర్యలు ఉంటాయి. ధర్మసత్రమైనా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే కూల్చేస్తాం. హైడ్రా నోటీసులు ఇవ్వదు.. కూల్చడమే" అని రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలోని పలు చెరువులు, పార్కుల ఆక్రమణలపై మంగళవారం పలువురు భాజపా కార్పొరేటర్లు హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

**హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు...** హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయానికి మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో ఫిర్యాదు దారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు క్యూ కడుతున్నారు. దీంతో హైడ్రా కార్యాలయానికి రోజు రోజుకీ తాకిడి పెరుగుతోంది. మొదట్లో పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు.. హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి చేరాయి. వాటన్నింటినీ స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. మరోవైపు ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు పెంచారు.

## జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద మరోసారి అధికారుల సర్వే



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామంలోని ఫామ్‌హౌస్ వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ఆర్ఐ తేజ, మండల సర్వేయర్ సాయితేజ సహా ఇరిగేషన్ శాఖకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం.. నక్ష, డీజీపీఎస్ యంత్రాలతో సర్వే చేస్తోంది. జన్వాడ ఫామ్‌హౌస్ పక్క నుంచి ఫిరంగి నాలా (బుల్కాపూర్ కత్వా) ప్రవహిస్తోంది. నాలాలో ఫామ్‌హౌస్ ప్రహరీగోడ, గేటు నిర్మించారని ఆరోపణలున్నాయి. జన్వాడ ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

## సారూ.. చెరువు కనిపించట్లేదు.. వెతికిపెట్టండి

మహేశ్వరం: తుమ్మల చెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో 8 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు కనిపించట్లేదని అందులో పేర్కొన్నారు. కబ్జా చేసి వెంచర్లు వేశారని ఆరోపించారు.

దీంతో పంటలు మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చెరువు ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామని గ్రామస్థులు ఆరోపించారు.

**మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేత...** రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేతలను చేపట్టారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది కూల్చివేసింది.

పోలీసు బందోబస్తు మధ్య ఎకరా భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660